# మానవ జీవితము ప్రేమమయంగా మార్చుకోవాలి

సకలశాస్త్రపురాణ సంగ్రహవేత్తయై
వేదాంతవేద్యుడౌ విబుధుడైన
రక్తి యేపారగ రమ్యహర్మ్యంబుల
రమియించు రాజచంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేకవీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్యవిభుడగు దాసుడైన
భక్తి లేనిచో ఎందుకు పనికిరాడు
భక్తిలేనట్టి ఆ జగద్భర్త కన్న
భక్తిపరుడగు దాసుడే భవ్యుడగును
ఇంతకన్నను వేరెద్ది యెరుక పరతు
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!

ప్రాచీన ఋషులకు పాఠముల్ నేర్పించ
జాలిన వేదాంతసారమతులు
నిర్జీవశిలలచే నృత్య మాడించంగ
నేర్వగల్గిన కళానిపుణమతులు
పరవీర శిరములు బంతులాడించుచు
క్రీడింపగల్గిన వాడి మగలు
సర్వసర్వంసహాచక్రపాలన చేసి
నడిపించగల్గిన నాయకులును



srisathyasaivaahinamrutam

**కలరు భారతభువిని పెక్కంద్రు నేడు**
**ఉండి ఫలమేమి వారిలో నొక్కరైన**
**అనుదినంబును వినిపించు ఆర్తరవము**
**ఆలకింపదలంపరో యార్యులార!**

ప్రేమస్వరూపులారా!

జగత్తంతయు ప్రేమచేతనే నిండి ఉంటున్నది. ప్రేమయే ధనము. ప్రేమయే ధర్మము. ప్రేమయే సత్యము. జగత్తంతయు ప్రేమపై ఆధారపడి ఉంటున్నది. ఇట్టి ప్రేమతత్త్వమును మానవుడు గుర్తించుకొనలేక జగత్తులో క్షణికమైన విషయవాసనలకై ప్రాకులాడి పవిత్రమైన, దివ్యమైన ప్రేమను విస్మరిస్తున్నాడు. కారణమేమిటి? స్వార్థము పెరిగినది. పరార్థము తరిగినది. సంకుచిత భావములు పెరిగినవి. విశాలభావములు తరిగినవి. ఆశలు పెరిగినవి. ఆశయాలు తరిగినవి. మానవత్వము కేవలము స్వార్థ, స్వప్రయోజనములచేతనే జీవితము నడుపుతూ ఉంటున్నాది. ప్రాచీన మహర్షులు త్యాగమునకే పట్టము కట్టుతూ వచ్చారు. ధర్మమునే అందలమెక్కించారు. త్యాగమునకే కిరీటము ధరింపచేశారు. సత్యమును స్వాగతము చేశారు. ఇట్టి దివ్యమైన భారతదేశమందు ఈనాడు దివ్యభావములు అంతరించిపోయినాయి. కనుకనే భారతదేశము అనేక అవస్థలతో కృంగి కృశ్లి కృశించిపోతున్నది. ప్రేమ లేని హృదయము కేవలము ప్రేత భూమియే! ఈ ప్రేమ పవిత్రమైన దివ్యత్వమును నిరూపించేది. సర్వత్రా నిండి ఉన్నది ప్రేమ ఒక్కటియే! ఈ ప్రేమయే ప్రతి మానవుని దివ్యత్వముగా నిరూపింపచేస్తున్నది.

## ప్రతి మానవుడు హృదయములో ప్రేమ నింపుకోవాలి

మానవునియందున్న స్వార్థ స్వప్రయోజనములు ఏనాడు దివ్యభావములుగా మారునో ఆనాడే ఈ ఏకత్వమనే ప్రేమ ప్రకాశిస్తుంది. ప్రతి మానవుడు హృదయములో ప్రేమ నింపుకోవాలి.

**ప్రేమరూపంబు బ్రహ్మంబు ప్రేమమయము**
**ప్రేమ ప్రేమతొ సంధింప నీమమగును**

sri sathyasaivachanamrutam

**కాన ప్రేమను గట్టిగా కల్గియున్న**
**అద్వితీయము నొందగ అర్హుడగును.**

ఈ ప్రేమ తత్త్వమును ఈనాడు ప్రతి మానవుడు గుర్తించి వర్తించటము అత్యవసరము. ఈ ప్రేమ సుముఖునియందు, దుర్ముఖునియందుకూడ, వనమునందును, భవనమునందును, రాగమునందును, విరాగమునందును, బాటయందును, మాటయందును, మదియందును, గదియందును వ్యాపించియున్నది. సర్వత్రా వ్యాపించినది ప్రేమ ఒక్కటియే! ఈ సత్యమును ప్రతి మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు. ఈనాడు జగత్తులో చెలరేగిన దుర్మార్గమును దూరము గావించుటకు ప్రేమ ఒక్కటియే అస్త్రము! ప్రేమయే రసము, ప్రేమయే పుష్పములు, ప్రేమయే దీని ఫలముకూడను. ప్రేమఫలము నిమిత్తమై ప్రేమనే అనుభవించాలి. ప్రేమను ప్రతి మానవుడు అర్థము చేసుకొనుటకు ప్రయత్నించాలి. ఈనాటి మానవుడు అర్థము, అధికారముల నిమిత్తమై ప్రాకులాడుతున్నాడు. అర్థము, అధికారము రెండు ఉండవలసినవే! కానీ వీటికికూడా కొంత పరిమితము ఉండాలి. భూమిని సస్యశ్యామలము గావించవలసిన సముద్రుడు తన పరిమితులను మీరినప్పుడు అపకీర్తుల పాలౌతాడు. అమృతమయమైన దేహమునకు, మనస్సునకు పుష్టిని, సంతుష్టిని అందించే ఆహారముకూడను మితముగా భుజించినప్పుడే దేహము పరిపూర్ణబలము పొందుతుంది. ఇది అమితమైనప్పుడు అనారోగ్యమునకు గురిచేసి అజీర్ణవ్యాధి కలిగిస్తుంది. మానవుడు తాంబూలము భుజిస్తుంటాడు. తాంబూలమునకు ప్రధానమైనది సున్నమే. యిది లేకుండిన తాంబూలము కానేరదు. అయితే సున్నము అధికముగా మనం ఉపయోగించినప్పుడు నాలుక పొక్కి పోతుంది. దేనినైనా ఒక పరిమితములో మనము ఉపయోగించుకోవాలి.

**మనస్సును హృదయమువైపు మళ్ళించినప్పుడు ఆనందము ప్రాప్తిస్తుంది**

ఈ జగత్తులో ప్రతి దానికి ఒక పరిమితము ఉంటున్నది. కానీ ప్రేమకు మాత్రం పరిమితము లేదు. అనిర్వచనీయం ప్రేమ. ఈ ప్రేమతత్త్వమును నారదుడు అనేక విధములుగా వర్ణిస్తూ వచ్చాడు. ప్రేమ ప్రవాహము ప్రతి మానవునకు ప్రాణమునందించే

sri sathyasai vahini amrutam

జలమే! ఈ ప్రేమను పొందవలెనన్న మానవుడు ఏవిధంగా ప్రయత్నం చేయాలి? కేవలము జపతపధ్యానములవల్ల లభ్యమయ్యేదికాదు. వేదశాస్త్ర యితిహాస పురాణములవల్ల లభించేదికాదు. భగవంతుడు హృదయమునందే ఉన్నాడు. అట్టి హృదయమువైపు మనస్సును మరల్చాలి. నోరును మూయించాలి. హృదయమును తెరిపించాలి. అప్పుడే ఈ ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. ప్రేమను పొందే నిమిత్తమై అనేకమంది ధ్యానము, జపము యోగములకు పూనుకుంటున్నారు. అనేక గ్రంథములు పఠిస్తున్నారు. పారాయణములు చేస్తుంటారు. ఇవన్నీ ధరించిన నగలవంటివేగానీ ఆత్మస్వరూపమును నిరూపించే మార్గములు కాదు. పాండిత్యము కేవలము ఒక నగ. వేదశాస్త్రయితిహాసములు పఠించటము, బాహ్యమైన అలంకారమువంటివి మాత్రమే! ఈ సాధనలేవీ అంతరంగ ఆనందమును చేకూర్చవు. అంతరంగ ఆనందము పొందవలెనన్న ప్రేమ ఒక్కటే ప్రధాన మార్గము. ఈనాడు ప్రేమ పూర్తిగా నిర్మూలమైపోయినది. ఈ ప్రేమ ఉండవలసిన స్థానములో ద్వేషము ప్రవేశించినది. సత్యము ఉండవలసిన స్థానములో స్వార్థము ఏర్పడినది. దయ ఉండవలసిన స్థానములో నిరుపయోగమైన అసూయ ప్రారంభమైంది. ఏఏ గుణములు ఏఏ స్థానములో ఎప్పుడెప్పుడు ఎక్కడుండాలో ఆ స్థానములో ఉండినప్పుడే మానవ జీవితము సుక్షేమంగా ఉంటుంది.

**భగవంతుని ప్రార్థించేటప్పుడు సర్వార్పిత భావముతో ప్రార్థించాలి**

ప్రేమస్వరూపులారా! మానవ జీవితము ప్రేమమయంగా మార్చుకోవాలి. ఈ ప్రేమమయ జీవితములో మానవుడు పొందలేని సుఖమే ఉండదు. సర్వ సంపదలు ప్రేమచేతనే ప్రాప్తిస్తాయి. సర్వ అధికారములు ప్రేమచేతనే లభ్యమవుతాయి. సర్వ విజయములు ప్రేమతోనే లభిస్తాయి. అయితే ఈ ప్రేమ ఎట్టిది? భగవంతుని ప్రార్థించే సమయములో మనము సర్వ అర్పిత భావముతో ప్రార్థించాలి. కానీ, యీ అర్పిత భావము ఈనాడు లేదు. భగవంతుడు కావాలని ఆశ ఉంటే, ఆధ్యాత్మిక ఆకలి మీయందు ఉంటే, భగవంతుని ఆనందము గ్రోలవలెననే దృష్టి మీలో ఉంటే, నిజముగా ఈ ప్రేమను దైవమువైపు ప్రయాణము చేయించండి. ఈ ఆకలి మీకు లేదు. ఈ దాహము మీకులేదు. ఈ

sri sathyasai vahamrutam

కోరిక మీకు లేదు. కేవలం దేవుని మీరు కోరుతున్నారే గానీ, ఆయన దివ్యతత్త్వమును అనుభవించుటకు తగిన సాధనలు మీరు చేయటం లేదు. నీరు కావాలి అనుకున్నంతమాత్రమున మన దాహము తీరదు. జలమును మన హస్తమునందుంచుకోవాలి. దానిని గ్రోలినప్పుడే దాహము తీరుతుంది. నిజముగా ఆధ్యాత్మిక ఆకలి మీయందు ఉండుంటే భగవంతుని ప్రేమ పొందటానికి మీరు ప్రయత్నించండి. ఈ ఆకలి తీరుతుంది. ఈ దాహము తీరుతుంది. ఆవేదన తీరుతుంది. అట్లుకాక సోమరివై 'భగవంతుడా! నాకు ఆనందమునందించి ఆకలి తీర్చు, నా దాహము తీర్చు, అని ప్రార్థించినంత మాత్రమున సఫలము కానేరదు. స్వార్థము హృదయమునందు నింపుకొని పరార్థమైన ప్రేమ తత్త్వము నీవు ఆశించినంతమాత్రమున అది నీకు ప్రాప్తించదు. ఈనాడు కోరవలసినది ప్రేమయే! ఈ ప్రేమకు రూపములేదు. ఈ ప్రేమ అనిర్వచనీయమైనది. అవాఙ్మానసగోచరమైనది. ఇది అనుభూతికి మాత్రమే లభ్యమయ్యేది. ఎంత సమీపింతువో అంత ఆనందమును అంత ఆహారమును నీవు అందుకోగలవు. ఈనాడు లోకములోని అన్ని అవస్థలకు మూలకారణము ఈ ప్రేమ లేకపోవటమే! అయితే ప్రేమ ఉన్నది. శారీరక పరమైన స్వార్థపరమైన ప్రేమగా ఉంటున్నాది.

**ఆధారము లేని ఆధేయమును ఆశ్రయించి ప్రయోజనమేమిటి?**

ఈనాడు దేహాత్మభావమునే ఆశిస్తున్నారు గానీ పరమాత్మభావమును ఆశించటంలేదు. ఉపాధులుమాత్రమే విశ్వసిస్తున్నారుగానీ ఉపాధికి ఆధారమైన ఆత్మతత్త్వమును విశ్వసించటంలేదు. ఆధారములేని ఆధేయమును ఆశ్రయించి ప్రయోజనము ఏమిటి? అన్నింటికి ఆధారము, అన్నింటికి ప్రధానము, ప్రమాణము ప్రేమ ఒక్కటి మాత్రమే! ఈ ప్రేమ ఎక్కడ పుడుతుంది? ఎక్కడ అంతమవుతుంది? 'దాసోహం, దాసోహం' అక్కడనుండి ప్రారంభమై 'సోహం, సోహం, సోహం' అనే దానిలో ఈ ప్రేమ అంత్యమవుతుంది. దాసోహం కాక సోహం అనే దాన్ని అనుభవించుటకు వీలులేదు. ఆ సోహమే ప్రేమ. 'సో'-'హం' లో 'సో' అనే ఆత్మ నేనే-ఆత్మయే ప్రేమ, ఆత్మయే బ్రహ్మ, ఆత్మయే సత్యము. ఆ

sri sathyasai vachanamrutam

ఆత్మయే ధర్మము. ఆ ఆత్మయే ప్రేమతత్త్వము. లోకమునందు ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థములుంటున్నాయి. యీ నాల్గింటినే ఆశిస్తూ మానవుడు జీవితము గడుపుతున్నాడే గానీ ఐదవ పురుషార్థమైన ప్రేమతత్త్వమును విస్మరిస్తున్నాడు. ఐదవ పురుషార్థమైన పరమప్రేమను పొందినప్పుడే జగత్తంతా నిత్యకళ్యాణంగా ఉంటుంది. ప్రేమ ఉన్నచోట ద్వేషమునకు అవకాశమేలేదు. ప్రేమ ఉన్నచోట అసూయకు స్థలములేదు. ఈ దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతనలకు ప్రేమయందు స్థానమే లేదు. ఒకవేళ మానవునియందు దురాలోచనలు, దుశ్చింతనలుంటే ఈ ప్రేమ పరుగెత్తిపోతుంది. ఇది ఒకే కుర్చీ! యిద్దరు కూర్చోటానికి వీలుకాదు. మానవుని హృదయము ఒక్కటే! ఆ హృదయమునందు ప్రేమమాత్రమే కూర్చున్నప్పుడు ఏ ఇతర గుణములు అందులో ప్రవేశించుటకు వీలుకాదు. హృదయము సుస్థిరమైనది, సున్నితమైనది, నిర్మలమైనది. ఇట్టి ప్రేమతో నిండిన హృదయమును మానవుడు ఈనాడు మ్యూజికల్ ఛైరుగా మార్చుకుంటున్నాడు. ఈనాడు ఒక స్వామి, రేపు మరొక స్వామి, కొన్నాళ్లకు ఇంకొక స్వామి. ఈనాడు ఒక జపము, మరునాడు ఒక జపము, ఈ విధంగా మారుస్తూ ఉంటే స్థిరమైన హృదయతత్త్వము ఏ రీతిగా గుర్తించుటకు వీలవుతుంది? ఎలాంటి పరిస్థితియందైనా హృదయమును సింగిల్ ఛైరుగానే విశ్వసించాలి.

## ప్రేమశక్తియే జగత్తును ఏకము చేస్తున్నాది

మానవునిలో రోగములు, రాగములు కలుగుతున్నాయి. దీనికి కారణం, భౌతిక వాంఛలు పెరిగిపోవటమే! ఈనాడు వాంఛలు అర్థమేలేని రీతిగా ఉంటున్నాయి. మానవుడు తన నిమిత్తమై తాను ప్రార్థిస్తున్నాడే గానీ ప్రపంచ నిమిత్తమై తాను ఏమాత్రం ప్రార్థించటంలేదు. సమాజము చాలా ప్రధానమైనది. దేశము చాలా ముఖ్యమైనది. సమాజ సంక్షేమమును గుర్తించి మనం వర్తించాలి. సమాజమే లేక వ్యక్తి ఏమాత్రం రాణించదు. ఆ వ్యక్తియందున్న శక్తి ప్రేమయే! ఆ ప్రేమ శక్తియే జగత్తును ఏకం చేస్తున్నాది. ఇన్ని వేలమంది ఇక్కడ ప్రవేశించుటకు కారణం ఏమిటి? ప్రేమయే మూలకారణము. ఈ ప్రేమ లేక మీరింత దూరము రావటానికి వీలులేదు. ఈ ప్రేమ ఎట్లా ఉంటున్నది? యిచ్చి పుచ్చుకునే ప్రేమగా

srisathyasaivahini.org

ఉంటున్నది. భగవంతుని ప్రేమ పుచ్చుకోవాలి, నీ ప్రేమ ఇచ్చుకోవాలి. అయితే, రెండుచేరి ఒకే ప్రేమయే! భగవంతుని ప్రేమయే నీ శరీరమునందు ప్రతిబింబముగా కనిపిస్తున్నది. దీనిని పురస్కరించుకునియే 'మమైవాంశో జీవలోకే, జీవభూతస్సనాతనః' అని బోధించాడు గీతాచార్యుడు. సనాతనుడైన భగవంతుని ప్రేమతత్త్వము సర్వభూతములందు ప్రతిబింబించుతున్నాది. ఈ ప్రేమను దుర్వినియోగపర్చుకోటానికి కాదు, యిచ్చినది. ఇది సద్వినియోగం గావించు. హృదయములో నింపుకో! పరులకు పంచు, దేశమును ఆనందపరచు! ఇదే ప్రేమయొక్క ప్రధానకర్తవ్యము. కానీ ఈ ప్రేమ తత్త్వమును మనం గుర్తించుకోలేకపోతున్నాము. సంకుచితమైన ప్రేమగా మనము భావిస్తున్నాము.

**భగవత్ప్రేమ ప్రతి మానవునియందు అణుస్వరూపమైయుంటున్నది**

ప్రాచీనకాలమునుండి భారతీయ మహర్షులు దీనిని స్వాగతం చేస్తూ వచ్చారు. 'అనిర్వచనీయం ప్రేమ' అని చెబుతూ వచ్చారు. 'ఇచ్ఛా రామో భవతి' అన్నింటికి ప్రేమయే ప్రధాన కారణము. ఏ తీపి పదార్థము చేసుకొన్నా 'చక్కెర' అనే common material ఉండినప్పుడే ఆ పదార్థములో తీపి మనకు గోచరిస్తుంది. ఈ చక్కెర లేక మైసూర్‌పాక్ లేదు, గులాబ్‌జాం లేదు, బర్ఫీలేదు, ఏమీ లేదు. అదే రీతిగా నైతికము, భౌతికము, ధార్మికము, ఆధ్యాత్మికము అన్నింటియందు ఈ ప్రేమ అనే చక్కెర చేరినప్పుడే ఆ వస్తువునకు తగిన విలువ వస్తుంది. కనుక, ఈ ప్రేమ హృదయము నిండుకు ఉంటుండాలి. అట్టి ప్రేమను నీవు వదలుకుంటున్నావు. ప్రక్కన ప్రవహించే గంగ ఉంటున్నప్పటికిని నీవు కేవలము మంచుబిందువులకై ఆశపడుతున్నావు. నీ దాహమును తీర్చేది గంగా ప్రవాహమేగానీ ఈ మంచుబిందువు కాదు. ప్రతి మానవునియందు ప్రతి కణమునందు, అణువునందు ప్రసరించేది, ప్రేమ ప్రవాహమే! సర్వత్ర అణుస్వరూపమై ఉంటున్నది ప్రేమయే! ఈ అణువే బ్రహ్మాండముగా రూపొందుతుంది. అణువు లేక బ్రహ్మాండమే లేదు. ఆ అణుస్వరూపమే భగవత్ప్రేమ. ఈ అణువు కేవలం అణువు మాత్రమే కాదు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్'. మహత్తునందు మహత్తుగాను అణువునందు అణువుగాను ఉంటున్నాది. మనయందే ఉన్న ప్రేమతత్త్వమును మనము యింకోచోటకు పోయి

sri sathyasai vachanamrutam

సంపాదించుకోనక్కరలేదు. మానవుడీనాడు ఉద్యోగముచేతను, వ్యాపారముచేతను ధనము ప్రోగుచేసుకుంటున్నాడు. నిజముగా మానవుడు ఆనందము పొందవలెనంటె ప్రేమధనమును పెంపొందించుకోవాలి. నీవు ధనమును కంపెనీలో పెట్టుకుంటున్నావు. ఇన్సురెన్సు కంపెనీలో పెట్టుకుంటున్నావు. కానీ, యీ కంపెనీలు ఏనాటికి శాశ్వతముకాదు. నీ సర్వస్వమును భగవత్ప్రేమ అనే కంపెనీలో భద్రపరచుకో! నీ డిపోజిట్టు ఎక్కడికి పోదు. ఈ డిపోజిట్టుకు డబుల్ డబుల్‌గా పెరిగిపోతుంటుంది. నీ ప్రేమధనమును అశాశ్వతమైన యిలాంటి బ్యాంకులలో పెట్టటం, చివరికి ఆ బ్యాంకులే నిర్మూలమై పోవడం జరుగుతుంది. దేనినైనా దొంగలించవచ్చుగానీ ప్రేమ ధనము దొంగతనము జరగటానికి వీలులేదు. బాహ్య బ్యాంకులు కాదు, మనకు కావలసినది. మనము ఈ ప్రేమను ఎక్కడ నింపుకోవాలి? ఏ బ్యాంకులో డిపాజిట్టు చెయ్యాలి? హృదయము అనే బ్యాంకులో పెట్టుకుంటే దానికి తలుపులులేవు, బీగములులేవు. అయినప్పటికి సత్యమై నిత్యమై కదలక మెదలక భద్రంగా ఉంటుంది. దీనినే అమృతస్వరూపము అన్నారు. అమృతస్వరూపముకంటె అధికమైనది ప్రేమస్వరూపము. అమృతము అని భావిస్తున్నాము. అమృతము ప్రాకృత జీవితాన్ని సార్థకము గావిస్తుంది. ప్రాకృత జిహ్వకు కొంత రుచి కలిగిస్తుంది. కానీ హృదయమునకే రుచి కలిగించేది, ప్రేమామృతము. కనుక, ఈనాడు ప్రేమామృతమును గ్రోలుటకు ప్రతి మానవుడు కంకణము కట్టుకోవాలి.

**త్యాగమునకు పట్టము కట్టినప్పుడే ప్రేమను స్వాగతము చేయుటకు వీలవుతుంది**

ఈనాడు మనము పట్టము కట్టవలసినది, త్యాగమునకు. త్యాగమునకు పట్టము కట్టినప్పుడే ప్రేమను స్వాగతము చేయుటకు వీలవుతుంది. అప్పుడే మన శక్తిసామర్థ్యములు విజృంభించిపోతుంటాయి. దేనిని తలంచినా, తక్షణమే ఫలసిద్ధి పొందుతుంది. ఆ అర్పితము గావించిన హృదయానికి ఏనాడుకూడను అశాంతిగానీ, అనానుకూలముగానీ, దుఃఖముగాని ప్రాప్తించదు. దీనిని పురస్కరించుకొనే వేదములు 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః' అని ఉద్ఘాటించాయి.

srisathyasaivachanamrutam

**ప్రేమమయుండు శ్రీధరుడు ప్రేమయె అతని దివ్యరూపమౌ**
**ప్రేమయె సర్వమానవుల ప్రీతికి తారకమంత్రమట్టి ప్రేమ**
**రవంతయైన వివరింపగలేక జగంబునందు త**
**త్కామిత సత్పదార్థమెటు గాంచగనేర్తురటయ్య మానవా!**

తట్టలోనున్న పదార్థము పొట్టలోకి చేరాలంటే నోటికి, చేతికి పని పెట్టాలికదా! ఆ ప్రేమ నీ సన్నిధియందే ఉన్నది. ఆ ప్రేమ నీ పెన్నిధియై ఉన్నది. నీకు సమీపమునందే ఉంటున్నది. కానీ నీవు అనుభవించుటకు తగిన ప్రయత్నము చేయటంలేదు. తట్టలో పెట్టుకొని పొటాటో, చపాతి అని ఎన్ని పర్యాయములు చెప్పినా పొట్టనిండుతుందా? చేతితో తీసుకో, నోటిలో పెట్టుకో, గొంతులో వేసుకుని మింగు. అప్పుడు నీలోనున్న వైశ్వానరుడు సర్వత్రా సప్లై చేసి సర్వశక్తులు సమకూరుస్తాడు.

**భగవంతుడు అంతా ప్రేమమయమే!**

దివ్యమైన ప్రేమ మన చుట్టు ఉంటున్నాది. అయితే మనము దీనిని చేతితో అనుభవించాలి. చేతితో అనుభవించటమంటే ఏమిటి? రామ, కృష్ణ, గోవింద అని భజన చేయాలి. నోటితో సంకీర్తన చేయాలి. నీకు నిజముగా భగవంతుడు కావాలనుకుంటే ప్రహ్లాదునివలె నిరంతరం స్మరించు 'ఓం నమో నారాయణ' అని. రాధ, మీరా వీరివలె నిరంతరము భగవంతుని ప్రార్థిస్తూరా! రామకృష్ణునివలే నిరంతరము భగవంతుని దర్శనము నిమిత్తము వెక్కి వెక్కి ఏడ్చు. అప్పుడే సాక్షాత్కరిస్తాడు భగవంతుడు. ఈనాడు అల్పమైన, స్వల్పమైన విషయములకు కంటిధారలు కారుస్తున్నారేగానీ దైవానుగ్రహ నిమిత్తమై కంటిధారలు కార్చటంలేదు. ఈ కంటిధారలు నీకు ఎట్లా వస్తున్నాయి? రెండు రకములైన కంటిధారలుంటున్నాయి. ఆనందబాష్పములు ఒకటి, శోకబాష్పములు రెండవది. ఈ ఆనందబాష్పములే భగవంతునికి అర్పితము చేయవలసినది. రుక్మిణి, కృష్ణుని తూచే నిమిత్తమై అక్కడికి వెళ్లి కృష్ణ నామమునకు, కృష్ణరూపమే, కృష్ణరూపమునకు కృష్ణనామమే సరైన తూకమనుకుంది.

**పత్రమో పుష్పమో ఫలమో తోయమో**

srisathyasaivachanamrutam

**భక్తి కలిగినవానికి వశుడవగుట**
**సత్యమేని కృష్ణా! నీవు ఈ తులసీ**
**దళమునకు తూగుదువుగాక!**

అన్నది. ఆ తులసీదళము ఎలాంటిది? పవిత్రమైన గుణములతో చేరినది. ప్రేమయే తులసీదళము. కేవలము నామము చెప్పినంతమాత్రమున రూపము సరైన తూకమునకు రాదు. భౌతికదేహమును, భౌతిక నామముతో స్మరించినంత మాత్రమున తూగదు. ప్రాకృత దేహము అప్రాకృతనామముచేతనే తూగుతుంది. ఇవి ప్రవృత్తిలక్షణములు, దేహముయొక్క లక్షణములు. నామము నివృత్తి లక్షణము. నారదుడు సామాన్యుడు కాదు. 'అమ్మా! రుక్మిణీ! నీవు ప్రవృత్తిమార్గములో పోతున్నావు. నివృత్తికే కృష్ణుడు చిక్కుతాడు. ఈ ప్రవృత్తి మార్గములో కృష్ణుడు తూగేటట్టుగా ఉంటే సత్యభామ కావలసినన్ని ఆభరణములు వేసిందిగానీ తూగలేదే! దీనికి తూగేవాడు కాదు కృష్ణుడు' అని బోధించాడు. అప్పుడు ఆమె తన చేతిలోని తులసిదళము 'కృష్ణార్పణం' అని వేసింది. కృష్ణనామము కృష్ణరూపమును సమానంగా తూచింది. తులసిదళము ఎక్కువ బరువు అయింది. కనుక, కృష్ణుడు రుక్మిణికి వశమైపోయాడు. ధనకనకవస్తు వాహనాదులతో భగవంతుడు తూగడు. అధికారములతో భగవంతుడు తూగడు. విద్యా మేధలతో భగవంతుడు తూగడు. ప్రేమచేత మాత్రమే భగవంతుడు తూగుతాడు. నీవు భగవంతుని తూచాలనుకుంటే ప్రేమ, ప్రేమ, ప్రేమ. ఈనాడు ఎక్కడైనా చూడండి, ప్రేమయే శూన్యము. తల్లీబిడ్డల ప్రేమకూడను మనం సరిగా అనుభవించలేకపోతున్నాం. భగవంతుని ప్రేమ నఖశిఖపర్యంతము ఉంటున్నాది. చక్కెరతో చేసిన బొమ్మలో ముక్కుతుంచి నోట్లో వేసుకున్నా తీయగానే ఉంటుంది. చెవితుంచి నోట్లో వేసుకున్నా తీయగానే ఉంటుంది. వేలుతుంచి నోట్లో వేసుకున్నా తీయగానే ఉంటుంది. కారణం ఏమిటి? సర్వము చక్కెరమయమే! కనుక భగవంతుడు అంతా ప్రేమమయమే! అట్టి మధురప్రేమ మీరు పెంచుకున్నప్పుడే మీకు ప్రేమస్వరూపుణ్ణి అడిగే అధికారము ప్రాప్తిస్తుంది. నీలో ప్రేమలేక భగవంతుని అడిగే అధికారము నీకు ఏమాత్రం లేదు. దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు హృదయములో నింపుకొని నిర్మలము, నిశ్చలము, నిస్వార్థము అయిన ప్రేమస్వరూపుని ప్రార్థిస్తే ఏమాత్రము ఉపయోగము లేదు.

srisathyasaivachanamrutam

ఎప్పుడూ నిర్మలంగా లేకపోయినా పూజరూములోనైనా నిర్మలంగా ఉంటే, ఆ పవిత్రమైన ప్రేమ నీకు ప్రాప్తిస్తుంది. లోకములో ఎందరో ఉపన్యాసములు చేసేవారున్నారు. ఎందరో హృదయమును కరిగించి కదిలింపచేసే ఉపన్యాసములిచ్చే మహనీయులున్నారు. కానీ ప్రయోజనం ఏమిటి? కేవలం ఉపన్యాసములతో కాలము గడుపుతున్నారుగాని, ఆచరణ శూన్యముగా ఉంటున్నాది. ఆచరణలో ఉంటున్నది, ఆనందము. ప్రచారములో ఆనందము లేదు. టన్నులు, టన్నులు ఉపన్యాసములిచ్చేదానికంటే ఒక ఔన్సు ప్రేమను త్రాగండి. అప్పుడే ఆ ప్రాప్తి లభిస్తుంది.

### భగవంతుని ప్రేమ ఒక లైట్‌హవుస్‌వలె నీకు మార్గమును చూపిస్తుంది

ప్రేమస్వరూపులారా! మీరు నిజముగా భక్తిని కోరుకుంటే దివ్య ప్రేమను మీరు ఆశ్రయించండి. మీ తాపము, మీ పాపము రెండింటిని చల్లార్చి మీ ఆకలి తీరాలంటే ఆ దివ్య ప్రేమను భుజించండి. మీరు లోకసంబంధమైన బాధలచేత, కష్టములచేత నిరాశనిస్పృహలకు గురై ఉంటున్నారు. నిర్విరామకృషిచే, నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థముకాని ఆవేదనచే కృశించే మానవునకు సరియైన దాహము తీర్చేది యీ ప్రేమ ఒక్కటి మాత్రమే! భగవంతుని ప్రేమ ఒక లైట్‌హవుస్‌వలె ఉంటుంది. అదే నీకు మార్గము చూపించేది. ఎప్పుడు మార్గము చూపిస్తుంది! ప్రేమ ఒక వైపుంటే నీవు మరొకవైపు ప్రయాణము చేస్తే యీ ప్రేమను పొందలేవు. లైట్‌హవుస్‌వైపే ప్రయాణము చేయాలి. జీవితమనే పడవలో సంసారమనే బరువు, బాధ్యతలను వేసుకున్నావు. కానీ, ఎన్ని బాధలుండినా ప్రేమవైపే ప్రయాణము చేయించు, పడవను. తప్పక నీవు గమ్యమునకు చేరతావు. విజయము పొందుతావు. ధన్యుడవు అవుతావు.

### హృదయములో భగవంతుని నింపుకో, చేతితో పనులు చేసుకో!

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరు ఏ సాధనలు చేయనక్కరలేదు. ధ్యానము చేస్తున్నాము, ఎవరికోసం ధ్యానము? ఆ ధ్యానస్వరూపుడు నీయందే ఉంటున్నాడు. నీవు ఎవరికోసం ధ్యానం చేస్తున్నావు? ఏమి ధ్యానం చేయాలి? ప్రేమనే ధ్యానం చేయి. నిరంతరము ప్రేమవైపే నీ మనస్సు మరల్చు. 'అట్లా ఉంటే మా గృహకృత్యములు ఏ



srisathyasaivachanamrutam

రీతిగా తీరుతాయ'ని మీరు సందేహించవచ్చు. నీ యింటిలో నీ పనులన్నీ చేసుకో! యిదంతా భగవదర్పితమనే భావించు. అదే ప్రేమ. నీ పనులు ఏదీ వదలనక్కరలేదు. అన్ని పనులు చేయి, కాని, సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అని భావించి భగవంతునికి అర్పించు. భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. భగవంతుడు లేని స్థానములేదు. సర్వులు భగవత్స్వరూపులే! సర్వం భగవత్స్వరూపమే! సర్వం బ్రహ్మస్వరూపమే! యిలాంటి ఆత్మభావమును దృఢం చేసుకోవాలి. దినదినాభివృద్ధి గావించాలంటే సూర్యునివలె చక్కగా ప్రకాశిస్తూ ఉండాలి. ప్రేమ దినదినప్రవర్ధమానమై పూర్ణచంద్రునివలె ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ ప్రేమయందు పక్షముల మార్పు కల్గి కొంత చీకటి ఏర్పడుతుంది. అమావాస్యరోజు చంద్రునిలో చీకటి వస్తుంది. ఈ ప్రేమచంద్రునియందు ఏ మాత్రము చీకటిలేదు. అట్టి విలువైన హృదయమును చక్కగా గుర్తించుకో! అల్పమైన, స్వల్పమైన వాటికై ఏమాత్రము తాపత్రయపడవద్దు. చేతులున్నాయి, మనస్సు ఉంది, వీటిద్వారా జగత్తులో వ్యాపారము సల్పుకో! దీనికే తుకారాం చెప్పాడు: 'దిల్‌మే రాం హాత్‌మే కాం'. హృదయములో భగవంతుని నింపుకో, చేతితో పనులు చేసుకో! తప్పులేదు. ప్రతి మానవుడు నేర్చుకోవలసినది, నేటినుండి జీవితాన్ని సరైన మార్గములో ప్రవేశింపజేయటానికి నిర్మలమైన ప్రేమ పొందాలి. భగవంతుని ప్రేమ నీలో లేకపోతే సర్వము నీకు దుఃఖమునే అందిస్తుంది. సర్వం దుఃఖమయం. సర్వం అస్థిరం అస్థిరం. ఆనందము కనిపించటంలేదు. బుద్ధుడు చెప్పాడు 'బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి', అని. మొట్టమొదట నీవు బుద్ధిని శరణుజొచ్చు. తరువాత బుద్ధిలోనున్న గుణముతో సంఘములో ప్రవేశించు. సంఘము శరణం. అయితే ధర్మం శరణం గచ్ఛామి. అప్పుడే ఆనందము ప్రాప్తిస్తుంది.

**జగత్తంతా భగవత్స్వరూపమే!**

ఒక చేతిలో చక్కెర పెట్టుకొని మరొక చేతిలో నీరు పట్టుకొని 'పానకం కావాలి, కావాలి', అంటే ఎట్లా అవుతుంది? ప్రకృతిని ఒకవైపున, పరమాత్మని ఒకవైపునా విడదీయకూడదు



srisathyasaivachanamrutam

మనం. 'సర్వం విష్ణుమయం జగత్'. జగత్తంతా భగవత్స్వరూపమే! అణువు, అణువునందు కణకణమునందు భగవత్స్వరూపమే! ఈ సత్యమును మీరు గుర్తించాలి. నీ ద్వేషి అయినా ఫరవాలేదు, కానీ నీవు వానిని తప్పక ప్రేమించు. తప్పక వాని హృదయము మార్పు చెందుతుంది. నీకు కీడు చేసినవానినికూడా ప్రేమించు. తప్పక వాని మనస్సే మారిపోతుంది! నీ మనస్సు మార్చుకోకు. ఎందుకంటే ప్రేమకు హృదయమే ప్రధానమైన నిలయము. దానిలో ఏ పదార్థము చేరుటకు వీలుకాదు. భగవంతుని మనం పిల్చేటప్పుడు కొన్ని సందేహాలు వస్తాయి. 'వస్తాడో, రాడో! దర్శనం యిస్తాడో, యివ్వడో! నాకు ప్రాప్తి చేకూరుతుందో, లేదో!' అలాంటివి. రాధవంటివారికికూడా కొన్ని సందేహములు ప్రారంభమైనాయి. ఒక రూములో పండుకోటానికి ప్రయత్నం చేసింది. మనసులో ఒక సంకల్పము ప్రారంభమైంది. ఎవరైనా వస్తారో ఏమో? 'వేయబోవని తలపు'. ఆ ప్రేరణ 'తలుపు వేసుకో' అని తొందర చేస్తున్నాది. 'వేసుకో' అనే సంకల్పము దేహాభిమానముయొక్క చింతయే! తిరిగి ఆత్మాభిమానము. కృష్ణుడు లోపలనే ఉన్నాడు. 'తీయమంటు పిలుపు' ఈ రెండింటికి మధ్య రాధకెందుకో నవ్వుగొలుపు'. 'ఎంత అవివేకిని! ఈ తలుపులా నన్ను రక్షించేది?' అనుకుంది. చివరకు తానే చింతించుకొని తనలో తాను నవ్వుకుంది. 'రాధకెందుకో నవ్వు గొలుపు. 'విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన వీధి వాకిలి ఏదటా' విశ్వమంతా భగవంతుని మందిరమే! యింకా వాకిలి ఎందుకు! 'వీణతంత్రులు మీటి, ప్రాణతంత్రులు నాటి' వీణతంత్రులు ఏమిటవి? రేచక, పూరక, కుంభక అనే మూలాధారమైన తంత్రులు. 'ప్రాణతంత్రులు నాటి' ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన యివే ఐదు ప్రాణములు. 'ఆనంద భాష్పములు ఆత్మార్పణము సేయ'. వీధి వాకిలి అదియేరా! అదే ముఖ్యమైన ద్వారం. అలాంటి సందర్భాన్ని పవిత్ర కవులు కవిత్వములో అంతర్భావములను పురస్కరించుకొని వర్ణిస్తూ వచ్చారు. కానీ కేవలం ఈనాడు భౌతికమునే ఆధారము చేసుకుంటున్నారు. అదే విధముగా మీరా చెప్పిన ప్రతి పదమునకు అంతరార్థములుంటున్నాయి. 'చలోరెమన్, గంగాయమునాతీర్' అనగా గంగా యమునా, యిడ, పింగళ అనే నాడులు సంగమము చెందే భ్రూమధ్యస్థానము. అక్కడ ఉంటున్నాడు, నీ కృష్ణుడు. ఓ మనసా! ప్రయాగ పోవాలని రైల్వేటిక్కట్టు బుక్ చేసుకోవద్దు. ఎక్కడకూ నీవు

sri sathyasai vachanamrutam

పోనక్కరలేదు. 'గంగాయమునా నిర్మలపానీ' అవి రెండు నిర్మలమైనవి. అనగా ఏమిటి? స్వార్థరహితమైనవి. గొప్పగా ప్రవహిస్తున్నాయి, గంగా యమునలు. కానీ తమ నీటిని తాము త్రాగటంలేదు. ఆ నీరు ప్రజలకే అందిస్తున్నాయి. అనుగ్రహమనే సాగరములో చేరిపోతున్నాయి. కనుక, నిర్మలత్వమును బోధించేవే యిడ పింగళనాడులు. అక్కడ ఉన్నాడు భగవంతుడు. 'మోరమకుట పీతాంబర సహిత కుండలరజిత శరీర్ చలోరేమన్' ఎంత అంతర్భావము ఉంది! ఎంత ఆనందమును చేకూరుస్తుంది.

## త్రికరణశుద్ధిచేత దైవము సాక్షాత్కారమవుతుంది

'భగవంతుడు గాన ప్రియుడు' అని వర్ణిస్తూ వచ్చారు నారద, తుంబురులు. వారు గానము చేస్తుంటే భగవంతుడు తన్మయుడై ఉండేవాడు. ఆ గానముచేత భగవంతుని ధ్యానము చేసినప్పుడు భగవంతునిలో నీవు లీనమైపోతావు. ఈ కారణముచేతనే 'సామూహిక భజన' అని పెడుతూ వచ్చారు. ఈ గానములోనున్న ఆకర్షణ మరొక దీనిలో కనిపించదు. మాకు గానము తెలియదేయని నిరుత్సాహపడనక్కరలేదు. నీ హృదయములోనే నీవు గానము చేయి. పదిమంది వినే కోసమని శృతిలయరాగతాళములు చూచుకోవద్దు. ఆ గానము భగవంతుని ఎంతగానో కదిలిస్తుంది. కారణం ఏమిటి? ఈ గానము నాభినుండి ప్రారంభమవుతుంది. నాభినుండి ప్రారంభమై జిహ్వనుండి వెలుపలకు వస్తుంది. అదియే నాభి, జిహ్వ, తాళము యీ మూడింటి ఏకత్వమే త్రికరణశుద్ధి. ఈ త్రికరణశుద్ధిచేత దైవము సాక్షాత్కారమవుతుంది. అనేకమంది కవులు ఎన్నో పద్యములు వ్రాస్తుంటారు. యింకా ఎంతో వచనములు చేస్తుంటారు. చెబుతుంటారు, పద్యములో 'రామా! నన్ను కాపాడు', అని. వచనంలోకూడా 'రామా! నన్ను కాపాడు', అంటారు. కాని ఈ రెండుకూడను అంత ఆకర్షణీయంగా ఉంటుండవు. దానికి బదులు 'రామా నన్ను కాపాడు' అని హృదయపూర్వకంగా గానము చేస్తే ఎంత ఆప్యాయంగా ఉంటుంది! భగవంతుని హృదయమునే లాగి వేస్తుంది. కావున గానముచేత దైవాన్ని లీనము చేసుకోవాలి. గానము భగవంతుని వరప్రసాదమే! భగవంతుని ప్రసన్నం చేసుకోవటానికి ఎంతమంది ప్రయత్నాలు చెస్తున్నారు! కాని, విఫలమైపోతున్నారు. ఏ ప్రయత్నము చేయకపోయినా,

srisathyasaivachanamrutam

గానము సుఖంగా సులభంగా సున్నితంగా మధురంగా ఆనందముగా ఆవిర్భవిస్తుంది. అది భగవంతుని వరప్రసాదమే! MS సుబ్బలక్ష్మి ఉంటున్నాదిక్కడ. మొదటినుండి గానముతో ఆమె హృదయము మాధుర్యంగా మారిపోయింది. ఇది అందరు ప్రాక్టీసు చేస్తే వచ్చేది కాదు. ఇది హృదయముతో భగవంతుని అనుగ్రహముతో అందుకున్న ప్రసాదమే! బాహ్యరీతిలో భజనచేస్తే పదిమందికి ఆనందము నందించవచ్చు. అట్లుకాక, నీలో నీవు ప్రార్థన చేసుకో! హృదయాన్ని మధురంగా మారుస్తుంది. ప్రేమచేత సర్వకర్మలని నిర్వర్తించు. ఏమి చేసినా భగవత్ప్రేమగా భావించుకో! చెడ్డది నీకు లభించింది అనుకో! ఇదికూడా భగవంతుని ప్రసాదమే! మలేరియా జ్వరము వచ్చింది నీకు. మలేరియా జ్వరం నివారణ చేయాలంటే క్వినైన్ అనే చేదుగా ఉండే మందు తీసుకోవాలి. అయితే అది చేదుగా ఉండినా, మధురంగా లేకపోయినా, జ్వరమును మాత్రం తగ్గిస్తుంది. ప్రపంచములో నీకు విరుద్ధమైన భావములు ఎదురైనా అవికూడా మంచినే చేకూరుస్తాయి. జాతి వజ్రమైనా కోతలు కోసినప్పుడే దానికి విలువ వస్తుంది. మంచి బంగారునైనా నిప్పులో వేసి కాల్చి కరిగించి సుత్తితో కొట్టినప్పుడే సుందరమైన నగగా తయారౌతుంది. మానవునికి కష్టములు, దుఃఖములు, నష్టములు మంచికోసమే! 'ఏది వచ్చినా అంతా నా మంచికోసమే' అని విశ్వసించాలి. అదే నిజమైన ఏకత్వము.

**హృదయమును ప్రేమమయంగా మార్చుకోండి!**

ప్రేమస్వరూపులారా! ఈ దేహమునకు 71 సం॥లు వచ్చాయి. దేహము ఏమిటి? 'దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్'. దేహమునుండి వచ్చిన ప్రేమతత్త్వాన్ని ఆధారంగా తీసుకోండి. నా జీవితమంతా ప్రేమమయమే! నేను ఎవరిని ఎప్పుడు ఏవిధమైన బాధలు పెట్టలేదు. ఎవ్వరికి అపకారము చేయలేదు. ఎవరిని ద్వేషించలేదు. ఎవరు నాకు ద్వేషులు కారు. కారణం ఏమిటి? నా ప్రేమయే ఈ మార్పు చేస్తుంది. ఈ దేహమునకు ఈనాడు 71 సం॥లు. నేను కార్యనిమిత్తమై కోప్పడినట్టు నటిస్తానుగానీ నా కోపము హృదయమునుండి కాదు, కేవలము నాలుకనుండి వచ్చేదే! నా కాలి గోరు మొదలుకొని తలవెంట్రుకవరకు ప్రేమయే! ఈ ప్రేమచేతనే జగత్తంతా స్వామి

sri sathyasai vahini

కీర్తి వ్యాప్తి గావిస్తూ వస్తున్నది. ఏ ఒక్కదానిని నేను ఆశించలేదు. P.P.P. మొదటి P-Purity, రెండవ P-Patience, మూడవ P-Perseverence. ఈ మూడు యిందులో ఉండటమే సాయినామము జగత్‌వ్యాప్తి కావటానికి కారణం. మేము ఎవరికి Invitation పంపించాము? ఎవరిని రమ్మని పిల్చాము? ఏమీలేదు. ఆ ప్రేమయే, అందరిని ఆకర్షిస్తుంది. ఆ మాగ్నెటులో అంత శక్తి ఉంటున్నాది. కొంతమంది యినుప ముక్కలవంటివారిని తీసుకోలేకపోవటంవలన వారనుకుంటారు: 'నిజంగా సాయి మేగ్నెటులో శక్తి ఉంటే నన్నెందుకు దగ్గరకులాగకూడదు?' అని. కాదు, కాదు; ఈ మేగ్నెటులో నిజంగానే శక్తి ఉంది. కాని, యినుపముక్కకు తుప్పు ఉంటున్నాది. అందువల్లే ఆకర్షించటంలేదు. ఆ తుప్పు తీసివేయి, తప్పక ఆకర్షిస్తుంది. అవియే రాగద్వేషములు, విషయవాసనలు, అసూయాభావములు. వీటన్నింటిని దూరంచేస్తే ఎక్కడ ఉండినా నీవు నావాడే! నేను నీవాడే!

**అడవులందున్న ఆకసముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేటబడియున్న**
**దిక్కులేని వానికి సాయి దిక్కు.**

ఎక్కడైనా ఉండు, నీ హృదయము పవిత్రము చేసుకో! పవిత్రమైన ప్రేమను పెంచుకో. ఆ ప్రేమచేత నీ జన్మ సార్థకం కావడమే కాకుండా నీ పరివారము, పరిసర ప్రాంతముల వారిని పవిత్రము చేయటానికి అవకాశముంటుంది. ఈసారి స్వామియొక్క ప్రధాన సందేశము 'హృదయమును ప్రేమమయముగా మార్చుకోండి'. నాకు ఏది యివ్వనక్కరలేదు. ప్రశాంతి నిలయములో ఒక పుష్పమునుగానీ, కొబ్బరికాయనుగానీ, అనుమతి చేయము. ఏ దానిని ప్రవేశపెట్టము. కానీ ఒక్క ప్రేమకు మాత్రమే ప్రవేశము.

**ప్రేమకు మించిన ఔషధము మరొకటిలేదు**

ప్రేమకు చిహ్నంగా ఈ రోజు స్వామి అక్కడనుండి ప్రయాణమైనప్పుడు ప్రేమబిందువులంతా కురిసాయి. శుభకార్యమునకు యిది ఒక శుభసూచన. ప్రపంచమంతా ప్రేమమయంగా మారాలి. అప్పుడే యీ దుఃఖములు, ఈ ద్వేషములు,

sri sathyasai vahini vachanamrutam

అసూయలు లేకుండా ఉంటుంది. అసూయ మహా దుర్మార్గమైన రోగము. ఒక యింటివారిని చూస్తే మరొక యింటివారికి అసూయ. ఒక వ్యక్తిని చూస్తే మరొక వ్యక్తికి అసూయ. ఒక గ్రామాన్ని చూస్తే మరొక గ్రామమునకు అసూయ. ఒక దేశమును చూస్తే మరొక దేశమునకు అసూయ. ఈ అసూయ ప్రాకిపోతున్నాది. ఈ అసూయను మొట్టమొదట నిర్మూలము చేయాలి. ఈ ద్వేషము నిర్మూలము చేయాలి. క్రోధము నిర్మూలము చేయాలి. ఈ మూడు ఎట్లా నిర్మూలం చేయాలి? ప్రేమతోనే! ప్రేమకంటె మించిన గట్టి ఔషధము మరొకటిలేదు. కనుక, ప్రేమను పెంచుకోండి! ఎవరిని చూచినా నవ్వుతూ నవ్వుతూ మాట్లాడండి. నీ ద్వేషి వచ్చినా 'బాగున్నారా సర్!' అని ప్రేమగా పలకరించండి. 'సార్!' అని పలకరిస్తే వాని హృదయములో ఎంత మార్పు వస్తుంది! ద్వేషిని 'ఛీ' అంటే వాడుకూడా 'ఛీ' అని పోతాడు. 'యద్భావం తద్భవతి'. అదియే హృదయానికి హృదయం సాక్షి. అందరిని ప్రేమతో పలకరించాలి. నేటినుండి సాధ్యమైనంతవరకు ప్రేమను అభివృద్ధి గావించుకోండి! ద్వేషమును నిర్మూలం చేయండి! అసూయను నిర్మూలం చేయండి! క్రోధమును దగ్గరకు రానివ్వకండి! వీటికి ఎంత దూరంగా ఉంటే అంత ఆనందము నీవు అనుభవిస్తావు. 'స్వామీ! very very Happy Birthday అన్నారు విదేశీయులు. I am always happy. Happy మీలోలేదు మీరే be happy అన్నాను. నాకు Happy Birthday చెప్పనక్కరలేదు. నేను ఎల్లప్పుడు happy గానే ఉంటాను. మీరు సంవత్సరమునకొకతూరి Happy Birthday అంటారు. నేను Happy కోసం సంవత్సరమువరకు కాచుకోను. క్షణక్షణము happy గానే ఉంటుంటాను. మీరుకూడా క్షణక్షణము happyగా ఉంటుండి, healthyగా ఉంటుండి, ప్రేమ అనే వరప్రసాదమును ప్రపంచమునకు పంచి మీ జీవితమును సార్థకము చేసుకోండి.

**(తేదీ 23-11-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam